# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1) **ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్రంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని పేర్కొన్న ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్.**

2) **ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి నేడు.**

3) **రాష్ట్రంలో ఎరువుల కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్న వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు.**

4) **హస్తకళా వస్తువుల అమ్మకాలను పెంచడానికి ఈ-కామర్స్ వేదికను సద్వినియోగం చేసుకోవాలన్న చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్ సవిత.**

==========================

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్రంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, సవాళ్లు ఎదురైనా.. ప్రణాళికా బద్ధంగా అడుగులు వేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. వరుసగా రెండో ఏడాది 'మత్స్యకార సేవలో' పథకం నిధులు విడుదల చేశామని ఆయన తెలిపారు. మత్స్యకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనం అని పవన్ కళ్యాణ్ అన్నారు.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు నివాళులర్పించారు. అచంచల దేశభక్తి, నిజాయితీ, నిబద్ధతలతో ప్రజల కోసమే జీవించిన మహనీయులు ప్రకాశం పంతులు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ లో పోస్ట్ చేశారు.

తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన వ్యక్తి ప్రకాశం పంతులు అని, ఆయన.. ధైర్యసాహసాలకు, ప్రజాసేవకు, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ లో పేర్కొన్నారు.

---------------------------

టంగుటూరి ప్రకాశం పంతులు త్యాగాన్ని, పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం పంతులు వర్ధంతి సందర్బంగా ఈరోజు ఆయన ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా మంత్రి శ్రీ బాల వీరాంజనేయస్వామి మట్లాడుతూ--

వాయిస్...27 సెకన్లు

---------------------------

గుంటూరు జిల్లా తాడేపల్లి లోని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమంలో ఆ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు చిత్తూరు జిల్లా కుప్పంలో పర్యటిస్తున్నారు. ఈ మధ్యాహ్నం కుప్పం చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులు ప్రసన్న తిరుపతి గంగమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సాయంత్రం బయలు దేరి ముఖ్యమంత్రి బెంగుళూరుకు వెళతారు. అక్కడ జరిగే ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వార్షికోత్సవంలో వ్యవస్థాపకులు రవిశంకర్‌తో కలిసి పాల్గొంటారు.

---------------------------

రాష్ట్రంలో ఎరువుల కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు హెచ్చరించారు. రైతులకు అందాల్సిన ఎరువులు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వ్యవసాయేతర పనులకు వినియోగించడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు ఆయన అమరావతి సచివాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు అందాల్సిన ఎరువులు ఇతర ప్రాంతాలకు తరలి పోవటాన్ని తీవ్రంగా పరిగణిస్తూ..... ఎరువుల డీలర్లు, గోదాములపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమీషనర్‌ను ఆదేశించారు. రైతులకు సరైన సమయంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని అందుకోసం జిల్లాల వారీగా ఎరువుల నిల్వలపై రోజువారీ సమీక్ష జరపాలని మంత్రి సూచించారు.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లాలో రహదారుల అభివృద్ధికి 247 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చెప్పారు. ఆయన నిన్న పాలకొల్లు నియోజక వర్గంలో 9 కోట్ల రూపాయలతో నిర్మించే పలు సీసీ రోడ్ల పనులకు నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో జనార్ధనరెడ్డి మాట్లాడుతూ

వాయిస్...30 సెకన్లు

---------------------------

హస్తకళా వస్తువుల అమ్మకాలను పెంచడానికి ఈ-కామర్స్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత సూచించారు. లేపాక్షి షోరూమ్‌లు, హస్తకళా రూపాల విక్రయాలపై మంత్రి

ఈరోజు అమరావతి సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. లేపాక్షి షోరూమ్‌లను ఆధునిక హంగులతో రూపొందించాలని సూచించారు. ఇప్పటికే మరమ్మతులు పూర్తి చేసిన ఢిల్లీ, కాకినాడ లేపాక్షి షోరూమ్‌లను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి  తెలిపారు. త్వరలో రాజమండ్రి విమానాశ్రయంలో నూతన లేపాక్షి షోరూమ్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.  హస్తకళాకారులకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించటమే  ప్రభుత్వం లక్ష్యమని మంత్రి సవిత స్పష్టం చేశారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 134 వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా  మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా  నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

కేంద్రప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏ ఒక్క నిరుపేద అనారోగ్యంతో మృతి చెందకూడదన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తిరుపతి జిల్లాలో మొత్తం 18 ప్రధానమంత్రి భారతీయ జనౌషధి పరియోజన కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా అతి తక్కువ ధరకే ప్రతినెల 65 వేలమంది నిరుపేద రోగులు నాణ్యమైన జనరిక్ మందులు 50 శాతం నుండి 80 శాతం వరకు రాయితీపై పొందుతున్నారు. ప్రధానమంత్రి  భారతీయ జనౌషధి పరియోజన కేంద్రాల్లో లభించే మందులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని  లబ్దిదారుడు చెపుతూ...

వాయిస్...27  సెకన్లు

---------------------------

పత్తి ధర స్థిరత్వానికి 11 శాతం దిగుమతి సుంకం రద్దు చేయాలని కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కే. రామ్మోహన్ నాయుడు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ను కోరారు. ఆయన నిన్న ఢిల్లీలో పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలుతో కలిసి  పీయూష్ గోయల్‌తో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, ఎగుమతులు, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన పలు కీలక సమస్యలపై వారు చర్చించారు. అమెరికా సుంకాలతో  రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తద్వారా లక్షలాది మంది  ఉపాధికి  సమస్యగా మారిందని వారు పీయూష్ గోయల్ కు వివరించారు.

---------------------------

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ –డిఆర్డిఓ  దేశీయంగా అభివృద్ధి  చేసిన మానవ రహిత  వైమానిక వాహనం నుండి ప్రయోగించే  క్షిపణి  ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. కర్నూలు సమీపంలోని పరీక్షా కేంద్రం నుంచి దీనిని నిన్న ప్రయోగించారు. ఈ క్షిపణిని హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్, అదానీ డిఫెన్స్ సిస్టమ్స్, టెక్నాలజీస్ లిమిటెడ్‌తో కలిసి డిఆర్డిఓ సంయుక్తంగా అభివృద్ధి చేసింది. ఈ క్షిపణి ఉత్పత్తిలో పెద్ద సంఖ్యలో దేశీయంగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు భాగస్వాములయ్యాయి.

ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. “ఈ విజయం రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ దిశగా సాధించిన వ్యూహాత్మక మైలురాయి” అని అభివర్ణించారు.

---------------------------

జూన్ 15వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు నిర్వహించే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. ఆమె నిన్న ఏలూరు కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సవరణ, జనగణనపై అధికారులతో సమీక్షించారు, జూన్ నుండి సెప్టెంబర్ వరకు నిర్వహించే ప్రత్యేక విస్తృత పునశ్చరణ–సర్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ అత్యంత కీలకమనదని ఆమె అన్నారు.

======================